

ధర్మారం మండల కేంద్రంలో పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులు(ఫైల్)

తాగునీటి పనుల బిల్లులకు తంటాలు..

● వేసవిలో రూ.1.83 కోట్ల నిధులు మంజూరు ● కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న కాంట్రాక్టర్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం పనులు చేయించిన అధికారులు బిల్లుల చెల్లింపులో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో జిల్లాలో పలువురు కాంట్రాక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధుల వెంటబడి పనులు చేయించిన మిషన్ భగీరథ అధికారులు ప్రొసీడింగ్స్ జారీ చేసి బిల్లులు చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వారం రోజుల నుంచి తాగునీటి ఎద్దడి నివారణ పనులు చేసిన వాళ్లు సంబంధిత కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ పథకం ద్వారా నిత్యం తాగునీరు సరఫరా చేస్తున్నారు.

గడిచిన వేసవి కాలంలో జిల్లాకు తాగునీటిని సరఫరా చేసే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీళ్లు అడుగంటడంతో మిషన్ భగీరథ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీరు అందడం లేదు. దీంతో గ్రామాల్లో అక్కడక్కడ సరిపడా తాగునీరు ప్రజలకు అంద లేదు. ఈక్రమంలో ఎక్కడైతే గ్రామాల్లో క్రిటికల్ గ్యాప్స్ ఉన్నాయో వాటిని గుర్తించాలని ప్రభుత్వం రెండు నెలల క్రితం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఆ మేరకు మిషన్ భగీరథ ఇంట్రా విలేజ్ అధికారులు ఓఅండ్‌ఎం గ్రాంటు కింద జిల్లా వ్యాప్తంగా కోటి 83 లక్షల రూపాయల విలువైన 171 క్రిటికల్ గ్యాప్స్ పనులను గుర్తించారు.

● **కోడ్ ముగిసినా ప్రొసీడింగ్స్ ఇవ్వని అధికారులు..**

అంతర్గాం మండలంలో 8 పనులకు 19 లక్షలు, పాలకుర్తి మండలంలో 16 పనులకు 19 లక్షలు, రామగుండం కార్పొరేషన్, మండల పరిధిలో 24 పనులకు 38 లక్షలు, కమాన్‌పూర్ మండలంలో 5 పనులకు 3 లక్షలు, మంథని మండలంలో 25 పనులకు 16 లక్షలు, ముత్తారం మండలంలో 12 పనులకు 14 లక్షలు, రామగిరి మండలంలో 12 పనులకు 16 లక్షలు, ఎలిగేడులో 12 పనులకు 7 లక్షలు, జూలపల్లి మండలంలో 10 పనులకు 14 లక్షలు, ఓదెల మండలంలో 14 పనులకు 16 లక్షలు, పెద్దపల్లి మండలంలో 17 పనులకు 15 లక్షలు, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 5 పనులకు 5 లక్షలు, సుల్తానాబాద్ మండలంలో 10 పనులకు 16 లక్షలు, ధర్మారం మండలంలో 25 పనులకు 19 లక్షలు, పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో 93 పనులకు 96 లక్షల రూపాయలతో పనులు మంజూరుచేశారు.

ప్రధానంగా పైపులైన్ల మరమ్మతులు, చేతి పంపుల మరమ్మతులు, పాత స్కీంలకు మోటార్ల బిగింపు వంటి పనులు తాత్కాలికంగా చేయాలని నిర్ణయించారు. పనులన్నీ 30 వేల నుంచి 3 లక్షల లోపు మాత్రమే ఉండడంతో నామినేషన్ ప్రాతిపదికన చేయించాలని అధికారులు నిర్ణయించారు. ఆ సమయంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో పనులు చేసేందుకు ఎవరు ముందుకు రాలేదు. ప్రొసీడింగ్స్ ఇస్తేనే పనులు చేస్తామని చెప్పారు. ఎలాగైనా వారిని ఒప్పించి పనులు చేయించాలని ఉన్నతాధికారులు పంచాయతీ అధికారులపై ఒత్తిడి తీసుకరావడంతో ప్రతిపాదించిన పనులను మొదలు కొన్నింటిని పూర్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఈనెల 6వ తేదీ నుంచి ముగియడంతో పనులు చేసిన వాళ్లు ప్రొసీడింగులు, బిల్లుల కోసం మిషన్ భగీరథ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

కానీ సంబంధిత అధికారులు ప్రొసీడింగ్స్ ఇవ్వడం లేదని చెబుతున్నారు. అప్పులు తీసుకవచ్చి తాగునీటి ఎద్దడి నివారణ కోసం మరమ్మతు పనులు చేశామని చెబుతున్నారు. తీరా పని అంతా అయిపోయిన తర్వాత సంబంధిత అధికారులు ప్రొసీడింగ్స్ ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి తాగునీటి ఎద్దడి నివారణ పనులకు సంబంధించి ప్రొసీడింగ్స్ జారీ చేసి ఎంబీ రికార్డులు చేసి బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.



జూలపల్లి మండలం కాచాపూర్‌లో చేతిపంపునకు మరమ్మతులు(ఫైల్)

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ

పెద్దపల్లిటౌన్, జూన్ 13: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధుల నివారణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో దోమలకాటు వల్ల సీజనల్ వ్యాధులు విస్తరించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. గత సంవత్సరం అధిక డెంగ్యూ కేసులు నమోదయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మండలాల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశాలు నిర్వహించాలని, ముందస్తుగానే జాగ్రత్త వహించాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించాలని ఆదేశించారు. గత సంవత్సరంలో 518 డెంగ్యూ కేసులు నమోదు కాగా, జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటివరకు 24 కేసులు నమోదు అయ్యాయని, డెంగ్యూ కేసులు నమోదయిన ప్రాంతాల పరిసరాల్లో ఫాగ్గింగ్ నిర్వహించాలని, డెంగ్యూ లక్షణాలుంటే వెంటనే పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలలో చదివే పిల్లల ఆరోగ్యంపై ప్రతి రోజూ మానిటరింగ్ చేయాలని, అక్కడ పారిశుధ్య నిర్వహణ, పిల్లల ఆరోగ్యంపై వార్డెన్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యశాఖ చేపట్టాల్సిన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేయాలని, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ పని చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖఅధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్, డీపీవో ఆశాలతా, జిల్లా మలేరియా అధికారి సుధాకర్ రెడ్డి, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, జిల్లా గిరి జన అభివృద్ధి అధికారి డి.జనార్ధన్, బి.సి. అభివృద్ధి అధికారి రంగా రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, డిఎస్‌సిడిఓ నాగలేశ్వర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

- మండల వ్యవసాయ అధికారి ప్రత్యూష

జూలపల్లి, జూన్ 13. మండల రైతులకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు అంటగడితే సంబంధిత డీలర్లపై చట్టపరమైనా చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారిని ప్రత్యూష అన్నారు. మండల కేంద్రంలోని పురుగు మందులు, విత్తన దుకాణాలను గురువారం ఏవో ప్రత్యూష, ఎస్‌ఐ శ్రీధర్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తన, పురుగు మందుల దుకాణాలలో ఉన్నా స్టాక్ నిలువలు, సేల్స్ రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు వాటికి సంబంధించిన రసీదులను అందించాలని డీలర్లకు ఏవో ప్రత్యూష సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మారం, జూన్ 13: మండలంలోని ధర్మారం,మల్లాపూర్, కొత్తూర్‌ల పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ ఖాసీం తెలిపారు. ఎండపల్లిలో 132/ కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు జరుగుతాయని, ఈ కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్టు తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

- రైతులకు అవగాహన కల్పించిన విదేశీ శాస్త్రవేత్తలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 13: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని విదేశీ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యాన శాఖ, తిరుమల ఆయిల్ కేమ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పెద్ద రాతిపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో జరిగిన అవగాహన కార్యక్రమంలో థాయిలాండ్, ఫ్రాన్స్, మలేషియా, ఇండోనేషియా దేశాలకు చెందిన శాస్త్రవేత్తలలో మలేషియాకు చెందిన శాస్త్రవేత్త నికోలస్ మాట్లాడుతూ 2050లో ప్రపంచ జనాభా 9.5బిలియన్‌కు దాటుతుందని, జనాభాకు సరిపడా మంచినూనె కావాలి అంటే రైతులు ఆయిల్ పామ్‌లు పెట్టుకోవాలన్నారు. ఈ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్‌లకు అనువైన నేలలు ఉన్నాయన్నారు. మలేషియాలో 70సంవత్సరాలుగా ఆయిల్ పామ్‌పై పరిశోధన జరుగుతోందని, ఈ ప్రాంత రైతులు దీని ద్వారా అధిక లాభాలు తీస్తున్నారన్నారు. అనంతరం ఫ్రాన్స్‌కు చెందిన శాస్త్రవేత్త లఖన్ మాట్లాడుతూ తమ దేశంలో 80సంవత్సరాలుగా ఆయిల్ పామ్ సాగు జరుగుతోందన్నారు. ఆయిల్ పామ్‌కు అనువైన పొట్టి విత్తనాలు ఈ దేశంకు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. నీటి ఎద్దడిని, తెగుళ్లను కూడా తట్టుకుంటుందన్నారు. థాయిలాండ్ శాస్త్రవేత్త షోలతన్ మాట్లాడుతూ థాయిలాండ్ అతి చిన్న దేశమైనా 90శాతం సన్నకారు, చిన్నకారు రైతులే ఉంటారని, వారందరూ ప్రస్తుతం ఆయిల్‌పామ్‌తో అభివృద్ధి చెందుతున్నారన్నారు. చిన్నదైన తమ దేశంలో ఆయిల్ తీసేందుకు 100 మిల్లులు ఉన్నాయన్నారు. థాయిలాండ్ ప్రభుత్వం కూడా ఆయిల్ పామ్‌ను ప్రోత్సహిస్తోందన్నారు. తమ దేశంలో 80సంవత్సరాలుగా పరిశోధన జరుగుతోందన్నారు. ఇండోనేషియా శాస్త్రవేత్త విజయన్ మాట్లాడుతూ ఇండోనేషియా దేశంలో 100సంవత్సరాల క్రితమే ఆయిల్ పామ్స్ రైతులు సాగు చేస్తున్నారని, ప్రపంచంలో అత్యధిక నూనె ఉత్పత్తి చేసే దేశం ఇండోనేషియా అని అన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసిన మూడు సంవత్సరాల నుంచి 40సంవత్సరాల వరకు పంట దిగుబడి వస్తుందన్నారు. మేము ఇచ్చే విత్తనాలు వాతావరణమునకు అనుకూలంగా ఉంటాయన్నారు. ఇది ఆఫ్రికా దేశపు పంట అయినా, ప్రపంచంలోని పలు దేశాల్లో ఈ పంట పండుతుందన్నారు. ఈ పంటతో రైతులు ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. భారత శాస్త్రవేత్త రంగనాయకులు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రరాష్ట్రంలో అన్ని నేలల్లో ఈ పంట పండుతుందన్నారు. ఈ దేశంలో ఆయిల్ పామ్ పంట పండించి నూనెను ఇక్కడే తయారుచేసుకోవాలని ఆలోచనతో ప్రభుత్వం 2021లో 11వేల కోట్లు ఈ ఆయిల్‌పామ్ సాగుకు ఇవ్వడం జరిగిందన్నారు. పామాయిల్‌తో పాటు బయోడీజిల్ కూడా తయారు చేసుకోవచ్చన్నారు. ఎకరాకు 57మొక్కలు పెట్టాలని, ఒక్కొక్క మొక్కకు 9మీటర్ల దూరంలో ఉండాలన్నారు. ఆయిల్‌పామ్ పెట్టుకున్న భూమిలో వరి తప్ప అంతర పంటలు ఏవైనా వేసుకోవచ్చన్నారు. ఖమ్మం జిల్లా అశ్వరావుపేటలో ఆయిల్‌పామ్‌తో రైతులు ఎంతో అభివృద్ధి చెందారన్నారు. ఈప్రాంతంలోనే పెద్దరాతిపెల్లిలో ఆయిల్ తీసే మిల్లు త్వరలో రాబోతుందని, రైతులంతా ఆయిల్ పామ్‌పై మొగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్‌రెడ్డి, పెద్దపల్లి, మంథని హార్టికల్చర్ అధికారులు జ్యోతి, శ్రీకాంత్ కంపెనీ సీఈవో కేసు కళ్యాణ్కర్, ఆయిల్ పామ్ రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ఆర్థిక ప్రణాళిక కలిగి ఉండాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి ఆర్థిక ప్రణాళిక కలిగి ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఏర్పాటుచేసిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. రిటైర్మెంట్ ప్రణాళిక రూప కల్పన, బీమా వల్ల ఉపయోగాలు, స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు, ఆర్థిక అంశాల్లో మహిళల పాత్ర వంటి పలు అంశాలను కలెక్టర్ ఉద్యోగులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మనిషికి వ్యక్తిగత ఆర్థిక ప్రణాళిక ఉండాలని, పటిష్టమైన ఆర్థిక ప్రణాళిక ఉండటం వల్ల మన జీవనం మెరుగవుతుందన్నారు. ప్రతి ఉద్యోగి కాంపౌండింగ్ అంశంపై అవగాహన కలిగి ఉండాలని, భవిష్యత్తు కోసం ఆదాచేసే సొమ్ము మార్కెట్‌లో పెట్టుబడిగా పెడితే మంచి రిటర్న్ వస్తాయని, ఎంత సమయం మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అంత అధికంగా లాభాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఉద్యోగులు మార్కెట్‌లలో లాంగ్ టర్మ్ పెట్టుబడులు పెట్టాలని, కొన్ని సమయాలలో ఆటు పోట్ల కారణంగా మార్కెట్ తగ్గిపోతుందని , మరికొన్ని సమయాలలో పెరుగుతుందని, సరాసరి చూసుకుంటే తప్పనిసరిగా 10 సంవత్సరాల సమయానికి మార్కెట్ పెరుగుతుందని, అనవసరంగా కంగారు పడి పెట్టుబడులను ఉపసంహరించుకోవద్దని సూచించారు. స్టాక్‌మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను సెబీ, ఆర్‌బీఐ సంస్థలు రెగ్యులర్‌గా మానిటరింగ్ చేస్తాయని తెలిపారు. డిమాట్ స్టాక్స్ ద్వారా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టవచ్చని అన్నారు. పబ్లిక్ బ్యాంకుల ద్వారా మనం నేరుగా స్టాక్స్ కొనుగోలు చేయవచ్చని, స్టాక్స్ కొనుగోలు సమయంలో బ్యాంకులకు నిర్దిష్టమైన రుసుం చెల్లించాలని, లాభంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వాటా ఇవ్వవద్దన్నారు. రిటైర్మెంట్ సమయానికి అవసరాలు, బాధ్యతలు తీరిపోయి, రిటైర్మెంట్ జీవితం సాఫీగా ప్రశాంతంగా గడిపేలా ఆర్థిక ప్రణాళిక ఉండాలని, దగ్గర ఉన్న నగదును ఆలోచనతో సరిగ్గా పెట్టుబడులు పెట్టాలని సూచించారు. అనంతరం ఎల్‌ఐసీ, ఎస్‌బీఐలైఫ్, ఆదిత్యబిర్లా సన్‌లైఫ్ మ్యూచువల్ ఫండ్స్, ఎస్‌బీఐ బ్యాంకు నుంచి వచ్చిన ఆర్థిక నిపుణులు పాలసీలను వివరించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన

- అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ

పెద్దపల్లిటౌన్, జూన్ 13: జిల్లాలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నేటి యువత రేపటి భావి భారత పౌరులని, వీరిలో కొంతమంది డ్రగ్స్ కు ఆకర్షితులు కావడంతో దేశ భవిష్యత్తు నాశనం అవుతోందని, దీనిని గుర్తించి కలిగే పరిణామాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అత్యంత కఠినంగా మాదక ద్రవ్యాలు సరఫరా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ విస్తరణ అధికారులతో తనిఖీ చేయించాలని, మారు మూల గ్రామాలు, బార్డర్ గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గంజాయి మొక్కలు కనిపిస్తే పోలీసు, ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని అదనపు కలెక్టర్ డ్రగ్ ఇన్స్ పెక్టర్ కు సూచించారు. జిల్లాలోకి మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణా కాకుండా చెక్ పోస్టుల వద్ద పకడ్బందీ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న విద్యా సంస్థల్లో విద్యార్థుల అలవాట్లను పరిశీలించాలని, మాదక ద్రవ్యాల వాడకం వల్ల వచ్చే నష్టాలను వివరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఏసిపి జి. క్రిష్ణ, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య, మంథని రెవెన్యూ డివిజన్ అధికారి హనుమా నాయక్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్, డ్రగ్ ఇన్స్‌పెక్టర్ పి.శ్రావణ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కలన, జిల్లా రవాణా అధికారి రంగారావు, జిల్లా ఎక్సైజ్ శాఖ, వ్యవసాయ శాఖ సంబంధిత సెక్షన్ అధికారులు, కలెక్టరేట్ సి సెక్షన్ పర్యవేక్షకులు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

వేలం పాటలో మల్లన్న క్షేత్రానికి 6.8 లక్షల ఆదాయం

ఓదెల, జూన్ 13 : మండలంలో దేవాదాయ ధర్మదాయ శాఖ భూముల కౌలు వేలం పాట ఒకటి పూర్తి కాగా ఓదెలలోని సీతారామచంద్రస్వామి, చీకటి తోట ఆంజనేయస్వామి ఆలయ భూముల కౌలు వేలంపాటకు అధికారులు రద్దు చేశారు. పొత్కపల్లి రాజగోపాల స్వామి ఆలయ భూముల కౌలు వేలం పాటను గురువారం నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రానికి రూ.6.8 లక్షల మేరకు ఆదాయం సమకూరిందని ఈవో సదయ్య తెలిపారు. ఇక్కడి 16 ఎకరాలకు వేలంపాట నిర్వహించగా 8 ఎకరాల భూమి ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, 4 ఎకరాలు ఆళ్ల సుమన్‌రెడ్డి, మూడెకరాల భూమి అంబాల కొమురయ్య, మరో ఎకరం భూమి శనిగరపు బుజ్జయ్య అనే రైతెల వేలంపాట ద్వారా దక్కించుకున్నారు. ఏడాదికి రూ.3.4 లక్షల చొప్పున 2026 మే వరకు దీని కాలపరిమితి ఉంటుందని ఈవో సదయ్య తెలిపారు. అలాగే ఓదెల సీతారామచంద్రస్వామి, ఆలయంలో అర్చకుని నియామకంపై రబాస ఏర్పడటంతో ఆలయంతో పాటు చీకటి తోట ఆంజనేయస్వామి ఆలయ భూములకు వేలం పాట కుదరలేదు. దీంతో ఈ ఏడాది పాటు కౌలును రద్దు చేసినట్లు ఈవో తెలిపారు.

30లోపు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 13: సివిల్ సర్వీస్ ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ కోసం జూన్ 30 లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి డి.జనార్ధన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలకు (ప్రిలిమ్స్ మెయిన్స్ ఇంటర్వ్యూ) ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ అందించేందుకు జిల్లాల్లోని ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నామన్నారు. అభ్యర్థులకు ఆబ్జెక్టివ్ టైప్ ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని, దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం మూడు లక్షలకు మించరాదని, అభ్యర్థులు జూన్ 30వరకు స్టడీ సర్కిల్. సీజీజీ.గోవ్. ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

1 నుంచి క్షయ వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్

- అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ

పెద్దపల్లిటౌన్, జూన్ 13: క్షయ వ్యాధి నివారణకు జూలై 1 నుంచి వ్యాక్సినషన్ కోసం చర్యలు తీసుకోవాలని తీసుకోవాలని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా క్షయ వ్యాధి ఫోరం రివ్యూ సమావేశంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ మాట్లాడారు. వయోజనులకు క్షయ వ్యాధి నివారణ కోసం టీకా కార్యక్రమం చేపట్టామని, ఇందు కోసం హెడ్‌కౌంట్ సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఈ ఏడాది నుంచి రాష్ట్రంలో ప్రారంభిస్తున్నామని, బీసీజీ వాక్సిన్ పిల్లలకు ఇస్తున్నామన్నారు. అదే వాక్సిన్ అడల్ట్ డోస్ పెద్దలకు ఇస్తారని, కాబట్టి ఆందోళన అవసరం లేదన్నారు. ఈ వాక్సినేషన్ కార్యక్రమం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి గ్రామంలో శిబిరాలను ఏర్పాటు చేసి, గుర్తించిన అర్హులకు వారికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఅధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కెవి సుధాకర్‌రెడ్డి, డీపీవో ఆశాలత, సీఐవో కె.నరెందర్, ఐఆర్‌ఎస్ కన్వీనర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ప్రమాదంపై ఆర్‌ఈడీ ఆధ్వర్యంలో విచారణ

జ్యోతినగర్, జూన్ 13 : రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో బుధవారం జరిగిన ప్రమాదంపై ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ ఈడీ(ఆర్‌ఈడీ) ప్రేంప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం విచారణ చేపట్టారు. ప్రమాదంలో అర్జున్ మరాండి అనే ఒడిశా కాంట్రాక్టు కార్మికుడు మరణించాడు. ఈక్రమంలో ఆర్‌ఈడీతోపాటు ఎన్టీపీసీ, బీహెచ్‌ఈఎల్ సేఫ్టీ ఉన్నతాధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. విచారణ అనంతరం పూర్తి నివేదికను ఎన్టీపీసీ ఢిల్లీ కార్పొరేట్‌కు పంపిస్తారని సమాచారం.

అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 13: అక్రమంగా తరలిస్తున్న పశువులను గురువారం గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు పట్టుకున్నారు. మంచిర్యాల నుంచి హైద్రాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ (ఎంహెచ్ 31బీ 0067)ను గోదావరి బ్రిడ్జి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేయగా 12 ఎద్దులను గుర్తించారు. సరైన పత్రాలు లేకుండా తరలిస్తుండడంతో పశువులను గో సంరక్షణా కేంద్రానికి తరలించారు. వాహనాన్ని అదుపులోకి తీసుకుని పశువులను తరలిస్తున్న ఎండీ ఇక్బాల్, బోడ మంగేష్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గోదావరిఖనిలో చోరీ

కోల్‌సిటీ, జూన్ 13: గోదావరిఖని జీఎం కాలనీలోని ముత్తె రాజు అనే సింగరేణి ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. రాజు కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లగా బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. రూ.లక్ష నగదు, 3తులాల బంగారం ఎత్తుకెళ్లినట్టు బాధితుడు పేర్కొన్నాడు. గురువారం బాధితులు ఇంటికి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీకి గురైనట్టు గుర్తించారు. ఫోరెన్సిక్ సిబ్బంది ఘటన స్థలంలో ఆధారాలు సేకరించారు. వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వృథాగా పాఠశాల భవనం

పెద్దపల్లి రూరల్, జూన్ 13 : మండలంలోని రాఘవపూర్ జిల్లా పరిషత్ పాఠశాల పాత భవనం సుమారు 8 ఏళ్లుగా ఎవరికి ఉపయోగం లేకుండా పోతోంది. ఇక్కడ మన ఊరు మన బడిలో భాగంగా నూతన భవనాన్ని నిర్మించినప్పటికి పాత భవనం స్థానంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో ముళ్లపొదలు పెరిగి శిథిలావస్థకు చేరుకుంటోంది. పాఠశాల స్థానంలో ప్రజలకు, రైతులకు, మహిళలకు, గ్రంథాలయాలకు ఉపయోగపడే విధంగా నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. అధికారులు స్పందించి పాత భవన స్థానంలో నూతన భవనాన్ని నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఓపెన్‌స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాలు విడుదల

కరీంనగర్ టౌన్, జూన్ 13: తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ నిర్వహించిన పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలను విద్యాశాఖ గురువారం విడుదల చేసింది. కరీంనగర్‌లో పదోతరగతి పరీక్షకు 446 మంది విద్యార్థులు హాజరుకాగా 188 మంది ఉత్తీర్ణత సాధించారు. 42.15శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 297 మంది పరీక్షలు రాయగా 265 మంది 89.23శాతం ఉత్తీర్ణత సాధించారు. పెద్దపల్లి జిల్లాలో 383 మంది పరీక్షలకు హాజరుకాగా 130 మంది 33.94శాతం ఉత్తీర్ణత సాధించారు. జగిత్యాలలో అత్యధికంగా 606 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా అత్యల్పంగా 109 మంది కేవలం 17.99శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

● ఇంటర్మీడియట్‌లో జగిత్యాల జిల్లాలో 503 మంది పరీక్షలు రాయగా 188 మంది, 37.38శాతం ఉత్తీర్ణత సాధించారు. పెద్దపల్లి జిల్లాలో 719 మంది పరీక్షలు రాయగా 331 మంది 46.04శాతం, కరీంనగర్‌లో 822 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కాగా వారిలో 480 మంది 58.39శాతం ఉత్తీర్ణత సాధించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 553 మంది పరీక్షలు రాయగా 402 మంది, 72.69శాతం ఉత్తీర్ణుల య్యారు. ఈమేరకు 2023-24 లో నిర్వహించిన పరీక్షలకు హాజరైన వారిలో ఉత్తీర్ణులైన వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌విఎస్ జనార్థన్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూ ల్ కో ఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో విడుదల చేశారు.

కొనసాగుతున్న విద్యా సంస్థల వాహనాల తనిఖీలు

తిమ్మాపూర్, జూన్ 13: విద్యా సంస్థలు ప్రారంభం కావడంతో రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ముఖ్యంగా విద్యా సంస్థల వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన తనిఖీలలో మొత్తం 24 వాహణాలను సీజ్ చేసినట్లు డీటీసీ పురుషోత్తం తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని విద్యా సంస్థల బస్సులు 2, ఫిట్‌నెస్, టాక్స్ లేకుండా నడుపుతున్న విద్యా సంస్థల బస్సులు 3, పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న విద్యా సంస్థల బస్సులు 4, పన్నులు చెల్లించని గూడ్స్ క్యారెజ్ వాహనాలు 6, ఫిట్‌నె స్ లేని గూడ్స్ క్యారెజ్ వాహనాలు 1, ట్రాక్టర్ ట్రాలీకి ట్యాక్స్ చెల్లించకుండా నడుపుతున్న ఒక వాహనాన్ని పట్టుకున్నాట్లు , పట్టుకున్న వాహనాలను సీజ్ చేసి జిల్లా రవాణా కార్యాల యానికి తరలించినట్లు డీటీసీ తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా అధికారులకు సహకరించాలని ఆయన తెలిపారు. వాహనాల తనిఖీల్లో ఎంవీఐటి రవికుమార్, ఏఎంవీఐ ప్రవంతి, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన వ్యక్తి రిమాండ్

వేములవాడ టౌన్, జూన్ 13: ఒకే భూమిని ఇద్దరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి సరిహద్దులు చూపకుండా మోసాలకు పాల్పడుతున్న సిరిగిరి రమేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గురువారం తెలిపారు. సిరిసిల్ల అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి రమేష్ అనే వ్యక్తి 20 సంవత్సరాల క్రితం తిప్పాపూర్ శివారులోని సర్వే నంబర్ 138, 139, 141, 142లో గల 200 గజాల భూమిని శాభాష్‌పల్లి గ్రామానికి చెందిన లెంకల రాజుకు రిజిస్ట్రేషన్ చేసి సరిహద్దులు సరిగా చూపెట్టకుండా ఇబ్బందులకు గురిచేశాడు. అంతే కాకుండా మరల అదే భూమిని సందవేణి ఎల్లవ్వకు గిఫ్ట్ డీడ్‌తో రిజిస్ట్రేషన్ చేయించి ఆమెను బెదిరించి సదరు మహిళ వద్ద లక్ష రూపాయలు తీసుకున్నాడు. సరైన హద్దులు చూపించకుండా మోసం చేయగా సందవేణి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 14 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

చేదబావిలో పడిన వృద్ధురాలు
- కాపాడిన అగ్నిమాపక సిబ్బంది


భాగ్యమ్మను బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చొప్పదండి, జూన్ 13: చొప్పదండి పట్టణంలోని జ్యోతినగర్‌లో గురువారం చేదబావిలో వృద్ధురాలు పడిపోగా అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. పెంబాల భాగ్యమ్మ (60) గురువారం ఉద యం ఇంటి సమీ పంలో ఉన్న చేదబా విలో ప్రమాదవశాత్తు పడిపోయింది. కుటుంబ సభ్యులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది తాళ్లసా యంతో బావిలోకి దిగి వృద్ధురా లిని పైకి తీసుకువచ్చారు. భాగ్యమ్మ స్వల్ప గాయాలతో బయట పడింది. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది జి రవీందర్, కె శ్రావణ్‌కుమార్, కె సతీష్, వి గంగేశ్ పాల్గొన్నారు.

నర్సింహస్వామి హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

కొడిమ్యాల, జూన్ 13 : మండలంలోని నల్లగొండ గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి హుండీ లెక్కింపును గురువారం అధికారులు, సిబ్బంది నిర్వహించారు. స్వామివారి హుండీలో 4లక్షల 66వేల 35 రూపాయల నగదు భక్తుల నుండి సమకూరినట్లు ఆలయ ఈవో వెంకన్న తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ ఛైర్మన్ సత్యనారాయణరావు, దేవాదాయ పరిశీలకులు సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ కమలాకర్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజినీకుమారాచార్యులు, మనోజ్‌కుమారాచార్యులు, కార్యాలయ సిబ్బంది, మహేందర్, కొమురయ్య, రమేష్, సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్య బలోపేతానికి 'పీసెట్' దోహదం
- శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ మల్లేష్



మాట్లాడుతున్న శాతవాహన మాజీ వీసీ మల్లేష్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్13: వ్యాయామ విద్య బలోపేతానికి పీసెట్ నిర్వహణ ఎంతగానో దోహదపడుతుందని శాతవాహన యూనివర్సిటీ మాజీ ఉపకులపతి మల్లేష్ అన్నారు. తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ శారీరక పరీక్షలు గురువారం శాతవాహన యూనివర్సిటీ మైదానంలో ముగిశాయి. మహిళ అభ్యర్థులకు నిర్వహించిన శారీరక సామర్థ్య పరీక్షలను ఆయన జెండా ఊపి మాట్లాడారు. రెండు పర్యాయాలు పీసెట్ నిర్వహణ బాధ్యతలను శాతవాహన యూనివర్సిటీ నిర్వహించ డంతో న్యాక్ గ్రేడ్‌కు అర్హత సాధించే అవకాశం ఉందన్నారు. పాలమూరు విశ్వవిద్యా లయం మాజీ ఉపకులపతి ఆచార్య లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యత ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లపైనే ఉంటుంద న్నారు. చివరి రోజు మొత్తం 345మంది మహిళ అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో 253మంది బీపీఈడీ అభ్యర్థులు కాగా 102మంది డీపీఈడీ అభ్యర్థులు. వీరికి 100మీటర్లు, 400మీటర్లు షాట్‌పుట్ ,హైజంప్, లాంగ్‌జంప్‌లతో పాటు 8క్రీడా అంశాలలో నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, టీజీ పీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ విభాగం డైరెక్టర్ ఆచార్య జెప్రభాకర్ రావు, శాతవాహన విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ నజీముద్దీన్ మునవర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్‌లు విజయ్‌కుమార్, బాలరాజు, శ్రీధర్ రావు, నాగేశ్వర్‌రావు, పన్యాల శ్రీనాథ్‌రెడ్డి, గడ్డి సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బోర్డు పైన పడి
పారిశుధ్య కార్మికుడి మృతి

ధర్మారం, జూన్ 13: ధర్మారం మండలం నందిమేడారం గ్రామంలో గల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఎల్తూరి సత్తయ్య(50) అనే పారిశుధ్య కార్మికుడు గురువారం చదును చేస్తున్న క్రమంలో పైన గల బోర్డు ప్రమాదవశాత్తు పడడంతో మృతి చెందాడు. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల వాటర్ ట్యాంక్ కింది భాగం ఆవరణలో గల చెత్తాచెదారాన్ని గ్రామ పంచాయతీ కార్మికుడు సత్తయ్య తొలగిస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంక్ యొక్క వాటర్ లెవల్ చూపే బోర్డు పై నుంచి సత్తయ్యపై పడింది. ఈ ప్రమాదంలో అతని ఎడమ భుజం వెనుక తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సత్తయ్య భార్య శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కార్మికులు కోరారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఇల్లంతకుంట, జూన్ 13: మండలంలోని నర్సక్కపేట గ్రామానికి చెందిన కొత్త శ్రీనివాస్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజుగౌడ్ పేర్కొన్నారు. మండలంలోని రేపాక గ్రామానికి చెందిన దళిత యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు..

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేములవాడ టౌన్, జూన్ 13: వేములవాడ మండలం చంద్రగిరి గ్రామంలో గురువారం తెల్లవారు జామున నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రగిరి గ్రామానికి చెందిన జవ్వాజి ఎల్లయ్య (55) అనే వ్యక్తి గురువారం తెల్లవారు జామున సిరిసిల్ల-వేములవాడ ప్రధాన రహదారి పక్కన నడుచుకుంటు వెళుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రగాయాలైన ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఎల్లయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత
- 34 మందిపై కేసు

కరీంనగర్ క్రైం, జూన్ 13: అక్రమంగా ఇసుక ను తరలిస్తున్న సమాచారం మేరకు గురువారం కరీంనగర్ రూరల్ పోలీస్ సబ్ డివిజన్ పోలీసులు దాడులు నిర్వహించి 34 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. కరీంనగర్ శివారులోని అలుగునూర్, తిమ్మాపూర్ మండలం రేణికుంటల వద్ద పోలీసులు నిర్వహిచి ప్రత్యేక తనిఖీలలో ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని మానకొండూర్, ఎల్ఎండీ పోలీసు ఠాణాలకు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానులపై కేసులు నమోదు చేశామని రూరల్ ఏసీపీ వెంకటరమణ తెలిపారు. ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు గోనెల సంపత్, బొంగోని రాజు, ఇరుగదిండ్ల సమ్మరాజు, సారయ్య, బోయిని అనిల్‌రాజు, పల్లపు ఎల్లయ్య, మార్క అభిషేక్, జితెందర్, వెంకటస్వామి, రాజేశ్వరి, అజయ్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, రమేశ్, సంపత్, ప్రణయ్‌వంశీ, అనిల్, అంజయ్య, రాజు, వెంకటేష్, రాజశేఖర్, హరితేజ, ఎల్లయ్య, గణేష్, అనిల్, కుమార్, రమేష్, రవి, ఎండీ అజీమ్, రమేశ్, రాజశేఖర్, జంపయ్యలపై ఐపీసీ సెక్షన్ 379, 21(4) మైన్స్ అండ్ మినరల్స్ యాక్టుతో పాటు మరిన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఏసీపీ వెంకటరమణ తెలిపారు.

● తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట గ్రామ సమీపంలోని మోయతుమ్మెద వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను గురువారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి వాటిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు


మాట్లాడుతున్న టౌన్ ఏసీపీ నరేందర్

కరీంనగర్ క్రైం, జూన్ 13: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామని టౌన్ ఏసీపీ నరేందర్ అన్నారు. నగరంలో గురువారం వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టుకొని 40 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపారు. పట్టుబడిన వాహనాలను ట్రాఫిక్ ఠాణాకు తరలించామన్నారు. మైనర్లకు వాహనాలిస్తే సంబంధిత వాహన యజమానులు, తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని కరీంనగర్ టౌన్ ఏసీపీ హెచ్చరించారు. కరీంనగర్‌లో బుధవారం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులకు గురువారం టౌన్ ఏసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలకు వాహన యజమానులు, తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు ఖరీముల్లా ఖాన్, స్వామి, ఎస్ఐలు ఇషాక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో రెండు చుక్కల దుప్పుల మృతి


దుప్పులకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వీర్నపల్లి, జూన్ 13: వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో కుక్కల దాడిలో రెండు చుక్కల దుప్పులు మృతి చెందాయి. గ్రామ శివారులోని పల్లె ప్రకృతి వనం సమీపంలో ఉండే అటవీ ప్రాంతం నుంచి తాగునీటి దాహార్తి తీర్చుకొనేందుకు రెండు చుక్కల దుప్పులు వచ్చాయి. దుప్పుల రాకను గుర్తించిన కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. గాయపడిన దుప్పులను గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించటంతో వాటిని స్వాధీనం చేసుకొని వైద్యం కోసం అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లారు. పశు వైద్యాధికారులు చికిత్స అందించినప్పటికీ కోలుకోలేక రెండు దుప్పులు మృతి చెందాయి. దాంతో అటవీ సెక్షన్ అధికారికి పద్మలత ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేయించి అటవీ ప్రాంతంలో కాల్చివేశారు

విద్యుదాఘాతంతో గేదె మృతి

ధర్మపురి, జూన్ 13: దమ్మన్నపేట గ్రామంలో గురువారం విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి చెందింది. గురువారం ఉదయం రైతు మడిపల్లి తిరుపతి తన గేదెను మేపడం కోసం సమీపంలో గల గోదావరి నది వద్దకు తీసుక వెళ్లాడు. గేదె గడ్డి మేస్తుండగా పొలం కోసం అమర్చిన విద్యుత్ మోటార్ వైరు తాకి షాక్ తగిలి మృతి చెందింది. గేదె విలువ రూ 70,000 విలువ ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు తిరుపతి కోరారు.

గుండెపోటుతో కూలీ మృతి

ఇల్లంతకుంట, జూన్ 13: మండలంలోని పొత్తూర్ గ్రామసమీపంలోని మానేరువాగులో కూలీపనికి వెళ్ళిన చెక్కిళ్ళ శ్రీనివాస్ (50) గురువారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


రాజు(ఫైల్)

వీర్నపల్లి, జూన్ 13: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవి పదిర గ్రామానికి చెందిన వేముల రాజు(40) బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా బుధవారం రాత్రి కోనరావుపేట గ్రామశివారులో ద్విచక్ర వాహనంతో చెట్టును బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్సులో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

మానకొండూర్, జూన్ 13: మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన బండి అశోక్‌కు చెందిన ఆవు గురువారం పిడుగుపాటుతో మృతి చెందింది. గ్రామంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో పిడుగుపడి ఆవు మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

96 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


ఐతరాజ్‌పల్లిలో పట్టుబడిన రేషన్ బియ్యం

సుల్తానాబాద్, జూన్ 13: జిల్లాలో గురువారం పౌర సరఫరాల శాఖ టాస్క్ ఫోర్స్ బృందం నిర్వహించిన తనిఖీలలో 96 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం నిల్వలు పటుకున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లి రేషన్ దుకాణాలను, ఐతరాజుపల్లి ఓపెన్ ఏరియా పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామంలోని రేషన్ షాపు తనిఖీచేసినప్పుడు 52.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఎక్కువగా రేషన్ షాప్ నిల్వలలో గుర్తించామని అన్నారు. అదేవిధంగా సుల్తానాబాద్ మండలం ఐతారాజుపల్లి వద్ద ఓపెన్ ఏరియాలో 43.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ నియంత్రణ ఉత్తర్వుల ప్రకారం వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని డీసీఎస్‌వో హెచ్చరించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా గుంత
- మరమ్మతులు చేయని అధికారులు
- రాకపోకలకు ప్రజల అవస్థలు


రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

మల్లాపూర్, జూన్ 13: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంత ప్రమాదకరంగా మారింది. మిషన్ భగీరథ నీటి సరఫరాలో లీకేజీ కావడంతో సంబంధిత అధికారులు పైపు మరమ్మతుల కోసం పది రోజుల క్రితం గుంత తవ్వారు. పనులు పూర్తి చేసుకున్నాక గుంతను మాత్రం అలానే ఉంచి వెళ్లారు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరనే ఆరోపణలు వేలువెత్తున్నా యి. అదే గుంతలో గ్రామానికి చెందిన బింగి మనస్వత్ అను బాలుడు గురువారం ప్రమాదవశాత్తు పడ్డాడు. దీంతో బాలుడి తలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రతి నిత్యం ఆ రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్లే బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రిల్లో ఆ రోడ్డుపై తెలియని వారు వేళితే ఏలాంటి ప్రమాదం జ రుగుతుందోనని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ అధికారులు స్పదించి గుంతను పుడ్చాల్సిన అవసరం ఉదని కాలనీ వాసులు వాపోతున్నారు.

రామగుండానికి డంపింగ్ యార్డు కరువు

- 2.5 లక్షల జనాభా.. చెత్త వేసే స్థలం లేదు.. - సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, జెన్‌కోల చేతుల్లోనే వేల ఎకరాలు

- కార్పొరేషన్‌కు అనువైన స్థలం ఇవ్వని సింగరేణి - పట్టించుకోని జిల్లా యంత్రాంగం





గోదావరి ఇన్‌టేక్‌వెల్ దారిలో డంప్ చేసిన చెత్త, రోడ్డు పక్కనే చెత్త డంపింగ్, తమ స్థలంలోకి రాకుండా ఆర్ఎఫ్‌సీఎల్ ఏర్పాటు చేసిన బోర్డు

కోల్‌సిటీ, జూన్ 13:వేల ఎకరాల ప్రభుత్వ స్థలాలు పారిశ్రామిక అవసరాల కోసం సింగరేణి, ఎన్‌టీపీసీ, జెన్‌కో, ఆర్ఎఫ్‌సీఎల్‌కు ప్రభుత్వం ఇచ్చింది. ఈప్రాంత ప్రజలు పంట పొలాలు, గ్రామాలను జాతి నిర్మాణానికి త్యాగం చేశారు. ఉదారతతో పరిశ్రమలకు అప్పగించారు. కానీ నేడు 2.5లక్షల జనాభా ఉన్న రామగుండం నగరానికి చెత్తవేసేందుకు స్థలం లేని దుర్భర స్థితి ఉంది... డంపింగ్ యార్డే కరువైంది... ఏ రోజుకు ఆ రోజు ఎక్కడో ఒక చోట చెత్త వేసి మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది నెట్టుకొస్తున్నారు. కార్పొరేషన్‌కు స్థలం లేకున్నా జిల్లా యంత్రాంగం దీనిపై దృష్టి సారించడం లేదు.

రామగుండం నగరపాలక సంస్థ 93చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారమే 2.37లక్షల జనాభా ఉంది. సింగరేణి, ఎన్‌టీపీసీ, జెన్‌కో, ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమలకు అనుబంధంగా కాలనీలు ఉన్నాయి. దీంతో పాటు రామగుండం నగరంలో 60వేలకుపైగా నివాసాలున్నాయి. కేవలం మున్సిపల్ కార్పొరేషన్ నుంచే ప్రతి రోజు 200టన్నుల చెత్త తొలగించాల్సి ఉంటుంది. దీంతో పాటు సింగరేణి, జెన్‌కో, ఎన్‌టీపీసీ కాలనీల నుంచి కూడా పెద్దఎత్తున చెత్త వస్తుంది. ఒక్క సింగరేణి కాలనీల నుంచే మరో వంద టన్నుల చెత్త వెలువడుతుంది. సాధారణంగా మున్సిపల్ కార్పొరేషన్‌కు రెండు నుంచి మూడు డంపింగ్ యార్డులు ఉంటాయి. ఒక్కో డంపింగ్‌యార్డుకు 25 నుంచి 50ఎకరాల వరకు స్థలం అవసరం ఉంటుంది. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 60వేలకు పైగా నివాసాలున్నాయి. కనీసంగా నాలుగు డంపింగ్ యార్డులు అవసరం ఉంటాయి. 93చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల నగరంలో రామగుండం, ఎన్‌టీపీసీ, గోదావరిఖని, ఎఫ్‌సీఐ ఏరియా, ఫైటింక్లయిన్‌కాలనీ ప్రాంతాలుగా విభజించి ఉంటుంది. ఏ ప్రాంతానికి ఆ ప్రాంతంలో సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. చెత్తను పోసేందుకు గతంలో సింగరేణి యాజమన్యామే డంపింగ్‌కు మైనింగ్ అయిన ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఇచ్చేది.

డంపింగ్ యార్డు లాక్కున్న సింగరేణి

రామగుండం నగరపాలక సంస్థకు జల్లారం శివారులో డంపింగ్ కోసం 10ఎకరాల స్థలాన్ని గతంలో సింగరేణి ఇచ్చింది. గోదావరిఖని, ఎన్‌టీపీసీ, ఫైటింక్లయిన్ కాలనీ ప్రాంతాల నుంచి చెత్తను తరలించేవారు. ఓసీపీ-5 ఏర్పాటులో భాగంగా డంపింగ్‌యార్డును సింగరేణి స్వాధీనం చేసుకున్నది. ప్రత్యామ్నాయంగా మరో చోట స్థలం ఇప్పిస్తామని చెప్పింది. సుందిళ్ల శివారులో నాలుగు ఎకరాల స్థలం ఇచ్చినా అది నివాసాలకు దగ్గరగా ఉండడంతో అక్కడ చెత్త పోస్తే గ్రామస్థులు వ్యతిరేకిస్తున్నారు.

40ఎకరాల స్థలం ఉన్నా...

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎస్‌టీపీ నిర్మాణాల కోసం గోదావరిఖని మల్కాపురం శివారులో 40ఎకరాల స్థలాన్ని ప్రైవేట్ పట్టాదారుల నుంచి కొనుగోలు చేసింది. గతంలో నిర్మించిన ఎస్‌టీపీలు ఇప్పుడు నిరుపయోగంగా ఉన్నాయి. చాలా వరకు భూఆక్రమణ పేర నిర్మాణాలు వెలిశాయి. తాత్కాలికంగా డంపింగ్‌యార్డుకు అవకాశం ఉన్నా నాలుగు నెలలుగా జిల్లా యంత్రాంగం దీనిపై దృష్టి పెట్టడం లేదు. నాలుగు నెలలుగా మున్సిపల్ కార్పొరేషన్ ఎక్కడ చెత్త వేస్తే అక్కడ సమీప ప్రాంత జనం అడ్డు చెబుతున్నారు. గోదావరి ఒడ్డున గల ఎఫ్‌సీఐ ఇన్‌టేక్ వెల్ సమీపంలో చెత్త వేస్తే ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం అడ్డుకున్నది. రోజుకు ఒక చోట డంపింగ్ చేసే పరిస్థితి ఉంది. శుక్రవారం డంపింగ్ చేసేందుకు స్థలమే లేదు.

పరిశ్రమల స్థలాలే మార్గం...

చెత్త డంపింగ్ కోసం రామగుండం, ఎన్‌టీపీసీ, ఫైటింక్లయిన్‌కాలనీ, గోదావరిఖని, ఎఫ్‌సీఐ ఏరియాలకు ఎక్కడికక్కడ డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వివిధ పరిశ్రమల చేతుల్లో ఉన్న ఖాళీ స్థలాలను డంపింగ్ యార్డులకు ఇప్పిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

స్థలం ఇప్పించేందుకు కృషి

- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

మున్సిపల్ కార్పొరేషన్‌లోని పరిస్థితులపై సమీక్ష చేశాను. డంపింగ్ యార్డు ఏర్పాటుకు సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి ఓసీపీ-5 ప్రాంతంలో స్థలం కేటాయించేలా చూస్తా. చెత్త సమస్యకు పరిష్కారానికి చర్యలు తీసుకుంటా.



తమ స్థలంలోకి రాకుండా ఆర్ఎఫ్‌సీఎల్ అడ్డుగా పెట్టిన రాళ్లు



రోడ్డు పక్కన చెత్తను దూరంగా నెడుతున్న జేసీబీ

ఆర్థిక సాయం అందజేత

ఫైటింక్లయిన్‌కాలనీ, జూన్ 13: న్యూమారేడుపాక గ్రామానికి చెందిన దివ్యాంగుడికి ఆర్థిక సాయం చేశారు వీహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు. గ్రామానికి చెందిన ఒంటరి యువకుడు సతీష్ పుట్టకతో మూగ, వినికిడి కోల్పోయాడు. గ్రామస్థుల ద్వారా యు వకుడి పరిస్థితి తెలిసిన వీహెచ్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వ్యాల హరీష్‌రెడ్డి రూ. 5వేల ఆర్థిక సాయం పంపడంతో 19వ డివిజన్‌కు చెందిన ఫౌండేషన్ సభ్యులు గురువారం సతీష్‌కు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

బదిలీ కోసం అధికారులపై ఒత్తిడి

జ్యోతినగర్, జూన్ 13 : తనను రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు నుంచి బదిలీ చేయించేందుకు ఐఎన్‌టియుసికి చెందిన ముఖ్య నేత అధికారులపై ఒత్తిడి తెస్తున్నాడని సంస్థ ఉద్యోగి కె.శ్రీపతిరావు ఆరోపించారు. గురువారం ఎన్టీపీసీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రామగుండం నుంచి కాయంకులం ఎన్టీపీసీకి(కేరళ) తనను బదిలీ చేశారని, అయితే తన ఆోగ్యం సరిగా లేని కారణంగా డిప్యుటేషన్‌పై తిరిగి రామగుండం పంపించారని తెలిపారు. గుండె జబ్బుతో బాధ పడుతున్న తనను తిరిగి కేరళకు బదిలీ చేయాలని యాజమాన్యంపై ఒత్తిడితెస్తున్నాడని ఆరోపించారు. సదరు నాయకుడిపై విచారణ జరిపించాలని ఈనెల 11న సీబీఐకి ఫిర్యాదు చేశానని తెలిపాడు.

15 నుంచి పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

కమాన్‌పూర్, జూన్ 13 : మండలంలోని జూలపల్లి తూర్పు వాడలోగల పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 15నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న పాల పోరుక కార్యక్రమం, 16న పోచమ్మ బోనాలు, 17,18న జోగు తిరుగుట, 19న పెద్దమ్మ బోనాలు, 20న బలి కార్యక్రమంతో ముగియనుందని తెలిపారు.

'డీజిల్ వినియోగంలో అక్రమాలు'

కోల్‌సిటీ, జూన్ 13: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య వాహనాలకు వినియోగించే డీజిల్ వినియోగంలో అనేక అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని కార్పొరేటర్ నగునూరి సుమలత ఆరోపించారు. పారిశుధ్య వాహనాల్లో తక్కువ డీజిల్ పోసి ఎక్కువ రికార్డు చేయడం వల్ల వాహనాలు డంపింగ్ యార్డుల వద్దే ఆగిపోతున్నాయన్నారు. అవినీతి ఆరోపణలు ఉన్న వ్యక్తులను దీనికి ఇన్‌చార్జిలుగా నియమించడం వల్ల అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాహనాల వినియోగం 30శాతం తగ్గినప్పటికీ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని, దీనిపై కలెక్టర్ చొరవ తీసుకుని వాహనాల వినియోగం, డీజిల్ బిల్లులపై విచారణ జరపాలన్నారు. రెండు బంకుల్లో డీజిల్ పోస్తున్నారని, ఒక బంక్‌లో నాయకులకు డీజిల్ పోస్తూ, మరో బంక్‌లో పారిశుధ్య వాహనాలకు పోస్తున్నారని, దీనిపై విజిలెన్స్ విచారణ జరుపాలని ఆమె డిమాండ్ చేశారు.

కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎన్నికలకు నాలుగు నామినేషన్లు

పాలకుర్తి, జూన్ 13: ఈనెల 18న జరగనున్న కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శి పదవికి నలుగురు వ్యక్తులు గురువారం నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి బద్దం డేవిడ్‌కు అందించారు. పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఎన్నికల్లో పొనవేని సదయ్య, మదాసు శ్రీనివాస్, నగునూరి రమేష్,కాల్వ నరేష్‌లు నామినేషన్లు వేశారు. ఈనెల 14న ఉదయం విత్‌డ్రాలు, మధ్యాహ్నం పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయిస్తామని డేవిడ్ తెలిపారు. ఎన్నికల్లో 805 మంది కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

కరాటే పోటీల్లో విజయం..

- అభినందించిన ఎమ్మెల్యే

కళ్యాణ్‌నగర్, జూన్ 13: కర్ణాటకలోని భాగల్ కోర్టులో ఈనెల 10 నుంచి 13వరకు జరిగిన సౌత్ జోన్ ఖేల్ ఇండియా ఉమెన్స్ ఉష్ లీడ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన నవీనను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అభినందించారు. మహిళా సీనియర్ తైజియన్ విభాగంలో బంగారు పతకం సాధించిన నవీన రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి వన్నె తెచ్చిందన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

సుభాష్‌నగర్, జూన్ 13: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గూడ కనకయ్య కోరారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్గునూరులో బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, కాని అధికారులు మాత్రం అందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. మానకొండూరు మండలం సదాశివపల్లి గ్రామంలో ప్రభుత్వ శిఖం భూమి అన్యాక్రాంతం అవుతోందని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేదన్నారు. సులభ్ కాంప్లెక్స్ మంజూరు అయిందని నిర్మాణం చేపట్టలేదన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మెరుగైన సౌకర్యాలు ఇప్పించేందుకు కృషి

- ఎన్టీపీసీ ఎన్‌బీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా

జ్యోతినగర్, జూన్ 13 : రామగుండం ఎన్టీపీసీ ఉద్యోగులకు మెరుగౌన సౌకర్యాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని, ఇటీవల ఆల్ ఇండియా ఎన్టీసీ ఎంప్లాయిస్ పెడరేషన్ సమావేశంలో ఉదోగుల డిమాండ్లపై తీర్మాణాలు చేశామని ఎన్టీపీసీ ద్వైపాక్షిక సంఘం(ఎన్‌బీసీ) సభ్యుడు, ఐఎన్‌టియుసి జాతీయ ఉపాధ్యక్షుడు బాబర్ సలీంపాషా పేర్కొన్నారు. గురువారం గుర్తింపు సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బాబర్ ఫెడరేషన్ ఎజెండా, తీర్మాణాల వివరాలను వెల్లడించారు. ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి 4 సంవత్సరాలుగా ఉన్న కాలపరిమితిని 3 ఏళ్లకు కుదించాలని, అన్ని కేటగిరిలకు ఇదే విధానం అమలుచేయాలని డిమాండ్ చేశామన్నారు. ఉదోగులందరికి కెరీర్ డెవలప్‌ఎంట్ స్కీం కింద శిక్షణనిచ్చి ప్రమోషన్లు ఇవ్వాలని, డిప్లొమా ఉన్నవారికి డబ్ల్యు 7 కేటగిరీకి పదోన్నతి కల్పించాలన్నారు. అన్ని కేటగిరి ఉద్యోగులకు కారు లోను, పెట్రోలు అలవెన్సులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 15 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన మాజీ ఉద్యోగులకు మాత్రమే వైద్య సౌకర్యం(పీఆర్ఎంఎస్) వర్తిస్తోందని, దానిని మార్చి ఎన్ని సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన అందరు రిటైర్డ్ ఉద్యోగులకు పీఆర్ఎంఎస్ పథకం వర్తింపచేయాలని ఫెడరేషన్ సమావేశంలో తీర్మానించామని బాబర్ తెలిపారు. ఉద్యోగులకు 30నుంచి 50 స్పెషల్ లీవులను(ఎస్‌పిఎల్) ఇవ్వాలని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఏడాదిపాటు టౌన్‌షిప్ క్వార్టర్లలోనే నివసించేందుకు అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు. కాగా, తనపై డిప్యుటేషన్‌పై వచ్చిన ఒక ఉద్యోగి తప్పుడు ప్రచారం చేస్తున్నాడని, తనపై ఆరోపణలు చేస్తే లీగల్ చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో గుర్తింపు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వేముల కృష్ణయ్య, అరెపల్లి రాజేశ్వర్, కదుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు



ఇరుకుగా ఉన్న రహదారి వెంట ప్రమాదకరంగా వెళ్తున్న వాహనాలు

కమాన్‌పూర్, జూన్ 13 : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఇరుకుగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఇరుకు రహదారి గురించి ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ సమీపంలో వాహనాలు అతిదగ్గరంగా ఒకదానికి ఒకటి తాకుతూ వెళ్తుండటంతో వాహనదారులు భయందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు రహదారిని ఆనుకొని వ్యాపారులు వ్యాపారం చేస్తుండటంతో మరింత ప్రమాదకరంగా రహదారి మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, జూన్ 13: గోదావరిఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974-75 విద్యా సంవత్సరలో 8వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. స్థానిక రాజలక్ష్మి గార్డెన్స్‌లో ఘనంగా గోల్డెన్ జూబ్లీ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలను సందర్శించారు. ఒకరి యోగ క్షేమాలను ఒకరు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో బుద్ధవనం ప్రాజెక్టు మాజీ చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య ఉన్నారు. ఈకార్యక్రమంలో మాజీ డీఎస్పీ రవీందర్, ప్రముఖ న్యాయవాది బల్మూరి అమరేందర్‌రావు, మాజీ మేయర్ జాలి రాజమణి, పులి మోహన్, బాలకృష్ణ, పెండెం సారయ్య, ఆకుల శంకర్, చంద్రశేఖర్, భీమ్‌సేన్, నారాయణ, రామకృష్ణలు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి'

పెద్దపల్లి రూరల్, జూన్ 13: మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీవో సుదర్శన్ అన్నారు. గురువారం మండలంలోని గోపయ్యపల్లి గ్రామంలో నిర్మిస్తున్న నూతన గ్రామ పంచాయితి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి రవిందర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు. చీకురాయి గ్రామంలో చేపడుతున్న మిషన్ భగీరథ సర్వేను పరిశీలించి తప్పిదాలు లేకుండా నమోదు చేయాలన్నారు. వారి వెంట పంచాయితి కార్యదర్శి రాధ, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యేకు మున్సిపల్ ఉద్యోగుల సన్మానం



ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

కోల్‌సిటీ, జూన్ 13: మున్సిపల్ కార్మికుల వేతనాల విషయంలో గుదిబండగా మారిన జీఓ నెం.937ను రద్దు చేయించినందుకు రామగుండం నగరపాలక సంస్థ తాత్కాలిక ఉద్యోగులు, కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను కలిసి సత్కరించారు. తాము విజ్ఞప్తి చేసిన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు బండారు రవి, మెట్టు శ్రీనివాస్, శంకర్, అశోక్, సుగుణాకర్‌రెడ్డి, సారయ్య, నాయకులు మహంకాళి స్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాష్, మారెల్లి రాజిరెడ్డి, తిప్పారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 13: ఏ మతానికి చెందిన వారైన తమ పండుగలను ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని ఏసీపీ కృష్ణ సూచించారు. ఈ నెల 17న బక్రీద్ పండుగ నేపథ్యంలో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. పండుగలు జరుపుకునే వారికి ఇతర మతస్తులు ఎలాంటి ఇబ్బంది కలిగించరాదన్నారు. అందరు స్నేహ పూర్వకంగా మెదులుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ కృష్ణ, ఎస్సై .మల్లేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గవర్నర్‌కు వినతి



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సురేష్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, జూన్ 13: హైదరాబాద్ రాజ్‌భవన్‌లో గవర్నర్ సీ.పీ.రాధాకృష్ణన్‌ను బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. జిల్లాలో మానేరు నదిలో జరుగుతున్న అక్రమ ఇసుక త్రవ్వకాలపై ఆధారాలతో సహా పిర్యాదు చేశారు. ఈసందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ మానేరు నదిలో గతంలో అడ్డగోలుగా త్రవ్వకాలు జరిపిన ఇసుక మాఫియాకి అధికారులు వంత పాడడం జరిగిందని సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మానేరు త్రవ్వకాలపై కొన్నేళ్లుగా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటం చేశామని చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ ని ఆశ్రయించామన్నారు. మానేరులో ఇసుక త్రవ్వకాలు జరుపడం నేరమిని ఇరిగేషన్, మైనింగ్ శాఖలకు 50 కోట్ల రూపాయల జరిమానా విధించినట్లు గుర్తుకు చేశారు. పిర్యాదును పరిశీలించిన గవర్నర్ దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్య తీస్కుంటామని హామీ ఇచ్చినట్లు సురేష్ రెడ్డి తెలిపారు.

'విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే'



మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సారాతస్నీమ్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ

అంతర్గాం, జూన్ 13: విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని రామగుండం బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణిపోచం అన్నారు. గురువారం అంతర్గాం మండలం పరిధిలోని లింగాపూర్ మోడల్ స్కూల్, పొట్యాల జెడ్‌పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించిన సంధ్యారాణి ఆయా పాఠశాలల్లో గల సౌకర్యాలు, విద్యార్థులు హాజరును తెలుసుకున్నారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు 10వ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో పాఠశాల హెచ్ఎంలను శాలువాతో ఘనంగా సన్మానించి లింగాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సారాతస్నీమ్, పొట్యాల హెచ్ఎం సంగీతలను మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విస్సంపేట మాజీ సర్పంచ్ మీస అనిత, బీజేపీ నాయకులు కొండపర్తి సంజీవ్, సుమంత్ పటేల్, పైతరి రాజు, బరుపటి నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఇంటి రుణంపై వడ్డీ చెల్లింపు ఆంక్షలు ఎత్తివేత

- సర్క్యులర్ జారీ చేసిన యాజమాన్యం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని, జూన్ 13: సింగరేణిలో కార్మికుల ఇంటి రుణంపై వడ్డీ చెల్లింపులో గతంలోఉన్న ఆంక్షలను ఎత్తివేసేందుకు యాజమాన్యం అంగీకరిస్తూ సర్క్యులర్ జారీ చేసిందని, దీనిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి కార్మికులు గతంలో బ్యాంకుల నుంచి ఇంటి నిర్మాణం లేదా ఇల్లు కొనుగోలు చేసుకుంటే రుణం తీసుకుంటే ఒక సంవత్సరంలోపు వారికి మాత్రమే వడ్డీ చెల్లించారని, దీని వల్ల చాలా మంది కార్మికులు సంవత్సరం దాటిన వారికి యాజమాన్యం వడ్డీ చెల్లించలేదని ఆయన తెలిపారు. అదేవిధంగా 8.33శాతం కంటే తక్కువ వడ్డీకి బ్యాంకు ఋణం తీసుకున్న వారికి 6 లేదా 7 శాతం చెల్లించారని ఆయన తెలిపారు. ఇట్టి సమస్యను ఏఐటీయూసీ గుర్తింపు సంఘం సింగరేణి డైరెక్టర్(పా), ఫైనాన్స్ జీఎం దృష్టికి తీసుకెళ్లి విన్నవించడం వల్ల గత సర్క్యులర్‌ను మార్చి ఇల్లు కట్టుకున్న లేదా కొనుక్కున్న తరువాత ఎప్పుడైనా బ్యాంకు రుణం తీసుకుంటే వారికి కూడా వడ్డీ చెల్లించేందుకు, తక్కువ వడ్డీకి రుణాలు తీసుకున్న వారికి కూడా 8.33 శాతం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరిస్తూ సర్క్యులర్ జారీ చేసిందని ఆయన తెలిపారు. కార్మికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామగిరి, జూన్ 13: సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌ల పరిధీలో కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లకు ఆర్జీ-3 సీఐటీయూ బ్రాంచ్ సెక్రెటరీ కొంరయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంటేశ్వర్లు, ప్రభాకర్, ఎండి అహ్మద్‌పాషా, రమణారెడ్డి, కుమార్, వేణుగోపాల్, రవికుమార్, సుధాకర్, మనోహర్, తిరుపతి, హబీబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఉపప్రధాన కార్యదర్శి నాగరాజు గోపాల్ అన్నారు. ఎస్ఆర్పీ1 గనిపై గురువారం యూనియన్ ఆధ్వర్యంలో గేట్‌మీటింగ్ నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతినెల అధికారికంగా నిర్వహించవలసిన రక్షణ కమిటీలను పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల సమస్యలు పేరుకుపోయాయన్నారు.

నిరుపయోగంగా పవర్‌లూమ్ భవనం

- ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళుతున్న నేత కార్మికులు - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఓదెల శివారులో నిరుపయోగంగా ఉన్న పవర్ లూమ్ భవనం

ఓదెల, జూన్ 13 : మండల కేంద్రం నుంచి కొలనూర్ వైపు వెళ్లే బైపాస్ రోడ్డులో పదేళ్ల క్రితం నిర్మించిన పవర్ లూమ్ భవనం నిరుపయోగంగా ఉంటోంది. కేంద్ర ప్రభుత్వం నిధులు దాదాపు రూ.32లక్షలతో మరమగ్గాల యూనిట్ల ఏర్పాటు కోసం ఈ భవనాన్ని నిర్మించి వదిలేశారు. అరకొర సౌకర్యాలతో ఉన్న ఈ భవనానికి మొత్తం బిల్లులు చెల్లించగా, మరమగ్గాలు లేకపోవడం వల్ల నిరుపయోగంగా మారింది.

ఉపయోగంలోకి వస్తే నేత కార్మికులకు ఉపాధి

నిరుపయోగంగా ఉన్న ఈ పవర్ లూమ్ భవనం వినియోగంలోకి వస్తే కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాలకు చెందిన 500 మందికి పైగా నేత కార్మికులకు ఉపాధి లభిస్తుంది. అంతకుముందు ఈ రెండు మండలాల మగ్గం కార్మికులంతా ఇంతకుముందు సుల్తానాబాద్‌లోని పవర్ లూమ్ యూనిట్ లోకి వెళ్లి నూలు వడికేది. అనంతరం కొన్ని పరిణామాల వల్ల అక్కడ చేతినిండా పని దొరకక పోవడంతో ప్రస్తుతం ఓదెలకు చెందిన 45 మంది నేత కార్మికులు జమ్మికుంటకు వలస వెళ్లి నూలు వడుకుతున్నారు. ఇక్కడి నుంచి అక్కడికి రాకపోకల వల్ల శ్రమకు తగ్గ ఫలితం, సరిపడా సమయం లేక కార్మికులు తీవ్రంగా నష్ట పోతున్నారు. అయినప్పటికీ 10 ఏండ్ల నుంచి పవర్లూమ్ కార్మికులను ఏ ప్రజాప్రతినిధి పట్టించుకోకపోవడంతో విధి లేక ఆర్థిక పరిస్థితులను తట్టుకొని, ఇతర ప్రాంతాలకు తరలివెళుతున్నారు.

పట్టించుకునే వారు కరువు..

పద్మశాలి నేతన్నలను మరిచినప్పటికీ కనీసం ఉపాధి కల్పన కోసం పవర్లూమ్ భవనాల నిర్మాణాన్ని పట్టించుకునేవారు కరవయ్యారు. 10ఏళ్ల క్రితం పద్మశాలి కూలీల ఆర్థిక స్వాలంబన కోసం, ఆత్మహత్యల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం నిధులతో ఉమ్మడి జిల్లాలో రూ.32 లక్షల చొప్పున మూడు పవర్లూమ్ భవనాలు మంజూరు చేశారు. ఇందులో ఓదెల మినహా సిరిసిల్ల, ఇల్లంతకుంటలో భవనాల నిర్మాణం పూర్తికాగా ప్రస్తుతం కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. వీటి పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా డిఆర్డిఓ అధికారులకు అప్పజెప్పారు. అయినప్పటికీ ఓదెలలోని భవనం ఉపయోగంలోకి రాకపోవడంతో కాల్వ శ్రీరాంపూర్, ఓదెల మండలాల నేత కార్మికులకు సక్రమంగా పనులు లేక,అలాగే అందుబాటులో ఉన్న పరమగ్గాల భవనం ఉపయోగంలో లేక ఇబ్బందులకు గురవుతున్నారు

భవనంలో మిగిలిన పనులు

రూ.32 లక్షల నిధుల వ్యయంతో నిర్మించినప్పటికీ ఇంకా ఈ పవర్లూమ్ భవనంలో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు పనులు మిగిలి ఉన్నాయి. మరమగ్గాల యూనిట్ల ఏర్పాటుకు అనుకూలమైన పనులు అలాగే కార్మికులకు మౌలిక సౌకర్యాల ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఇక్కడి భవనంలో ప్రహరీ గోడ నిర్మాణం, అలాగే నీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం, విద్యుత్ పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. దీనికి కేటాయించిన నిధులతో నామ మాత్రం పనులు చేసి వెళ్లిపోయారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ భవనం ప్రస్తుతం సాయంత్రం వేళల్లో మద్యంప్రియులకు అడ్డాగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. కాగా, నెల వరకు భవనాన్ని ఉపయోగంలోకి తెస్తామని పద్మశాలి సంఘం గౌరవఅధ్యక్షుడు మేర్గు భీష్మచారి తెలిపారు. పద్మశాలి కార్మికులకు ఉపాధి కల్పించేందుకు నెలలోనే పవర్లూమ్ భవనాన్ని ఉపయోగంలోకి తెస్తామన్నారు.నేతకార్మికులు ఎక్కడికి వెళ్లకుండా చేతినిండా పని లభిస్తుందన్నారు.